# కష్టార్జితం

శ్రీ పిళ్ళా సుబ్బారావుశాస్త్రి.

అవి ఉజ్జయినీ నగరాన్ని భోజరాజు పరిపాలిస్తూవుండే రోజులు. భోజరాజు గొప్పవాడు. ఆయన రాజ్యంలో దారిద్ర్యం అనేది లేకుండా చేశాడు. పండితులను, కవులను పోషించేవాడు. ఎవరు యేది అడిగినా లేదనక యిచ్చేవాడు.

అటువంటి ఉజ్జయినీ పట్టణంలో ఒక పేద బ్రాహ్మణ కుటుంబం వుండేది. బ్రాహ్మణుడు ధర్మబుద్ధి, న్యాయబుద్ధి గలవాడు- ఆతని భార్య చెప్పింది "ఏమండీ! మన రాజుగారు ఎవరు యేది అడిగినా యిస్తున్నారట....! మీరు గూడా పోయి మన దరిద్ర బాధ ఆయనకి చెప్పండి! ఆయన ఏదన్నా యిస్తే సుఖపడదాం!" అని.

"పిచ్చిదానా! రాజులు ఎందుకు అలా అడగ్గానే యిస్తున్నారో ఆలోచించావూ? అది వారి కష్టార్జితమైతే యిస్తారా....? అది వారి కష్టార్జితం కాదు! దొంగ సొమ్ము....!! ప్రజలను పీడించి ఆర్జించిన పాపపు సొమ్ము ....!!! పట్టపగలు పోయి దోచుకున్న దోపిడీ సొమ్ము....! ఈ ఆకలి బాధతో చచ్చినా సరే. వారి దగ్గరకు వెళ్ళి యాచించను!!! ముష్టి యెత్తుకునేటంత వెధవపని మరొకటి లేదు....!!!" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

ఒకనాడు బ్రాహ్మణుడు భార్య నిర్బంధం మీద భోజరాజు దగ్గరకి వెళ్ళాడు. తన దరిద్ర బాధని ఆయనకి వివరించి చెప్పేడు! "స్వామీ! అయితే మీరు ఏరాజ్యం నుండి వచ్చారూ?" అని ప్రశ్నించాడు భోజరాజు.

"ప్రభూ! నేను యీ పట్టణంలోని వాడినే!" అనగానే రాజు చాలా బాధపడ్డాడు— తర్వాత కావల్సిన ధనం యిచ్చి పంపమని ఆజ్ఞాపించాడు.

"ప్రభూ! నాకు కావల్సింది మీకష్టార్జితం మాత్రమే!" అన్నాడు బ్రాహ్మణుడు. భోజరాజు యీమాట విని కొంతసేపు ఆలోచించి "బ్రాహ్మణోత్తమా! ప్రస్తుతం నా కష్టార్జితం దమ్మిడీకూడా లేదు! రేపు రా!" అని ఆయన్ని సాగనంపేడు.

భోజరాజు ఆరోజురాత్రి మారువేషంలో బయలుదేరాడు పని కోసం!— పట్టణమంతా తిరగ్గా ఒక కమ్మరివాడు కనిపించాడు. అక్కడికి వెళ్ళి వాడిని యేదయినా పని యిమ్మని బ్రతిమాలేడు— యెలాగయతేనేం ఉదయానికి నాలుగు రాగి కానులు సంపాదించేడు!

మర్నాడు బ్రాహ్మణుడికి అవి యిచ్చేశాడు. బ్రాహ్మణుడు అవి ఎంతో సంతోషంతో పుచ్చుకున్నాడు. వాటిని తీసుకుపోయి భార్యచేతికివ్వగానే ఆమె ఖస్సుమంటూ ఒక గూటిలో పారేసింది!

మర్నాడు ఆ రాగి కానులను చూడబోతే బంగారు కానులయి వున్నాయి! బ్రాహ్మణ దంపతులు వాటిని తీసుకొని పగలగొట్టి బజార్లో అమ్మి కావల్సిన సరుకులు తెచ్చుకున్నారు. ఇలా వీరు వాటిని విరుస్తూవుండడం, అవి తిరిగి యథాప్రకారంగా కానులవడం జరుగుతోంది!

ఒకనాడు భోజరాజు పట్టణ పరిస్థితి చూడటానికి వచ్చాడు. ఆయనకళ్లు ఒక పెద్ద భవనాన్ని ఆకర్షించేయ్! ఆ భవనంలోనుండి బ్రాహ్మణుడు వచ్చి ఆహ్వానించేడు.

"మహారాజా! మీరు యిచ్చిన నాలుగు రాగి కానులే యిలా బంగారు కానులుగా మారినై! ఇవి తుంచినా తిరిగి కానులయిపోతున్నాయి!!" అంటూ చెప్పాడు.

రాజు వాళ్ళు సుఖంగా వుండటంచూసి ఆనందిస్తూ తన రాజ్యం చేరుకున్నాడు.